క్లుప్తంగా

ట్రైసైకిల్ అందజేత

చొప్పదండి: మండలంలోని కోనేరుపల్లి గ్రామానికి చెందిన దివ్యాంగుడు గజ్జెల నాగరాజుకు వీ4 నీడి సంస్థ సహకారంతో హెల్పింగ్ హార్ట్స్ ఆధ్వర్యంలో బుధవారం ట్రైసైకిల్ అందించారు. కార్యక్రమంలో జిల్లా యువజన అవార్డు గ్రహీత గజ్జెల అశోక్, జెరిపోతుల మహేశ్, నవీన్ కుమార్, రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

శంకరపట్నం ఆర్ఐ బదిలీ

శంకరపట్నం: శంకరపట్నం ఆర్ఐ లక్ష్మారెడ్డి వీణవంకకు సీనియర్ అసిస్టెంట్‌గా బదిలీ అయ్యారు. వీణవంక తహసీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ ఉద్యోగులపై ఆరోపణలు రావడంతో ఆర్ఐ నుంచి అటెండర్ వరకు కలెక్టర్ బదిలీ చేసిన విషయం తెలిసిందే. వీణవంకలో రెవెన్యూ పనులు చక్కబెట్టేందుకు శంకరపట్నం ఆర్ఐని సీనియర్ అసిస్టెంట్‌గా వీణవంకకు బదిలీ చేశారు.

విద్యుత్ సిబ్బంది స్థానికంగా ఉండాలి

చొప్పదండి: మండలంలోని వెదురుగట్టలో విద్యుత్ సిబ్బంది స్థానికంగా లేక పోవడంతో ఇబ్బంది పడుతున్నామని సిబ్బంది స్థానికంగా ఉండేందుకు చర్యలు తీసుకోవాలని మాజీ సర్పంచ్ పంతంగి ప్రభాకర్ ట్రాన్స్‌కో అధికారులకు ఫిర్యాదు చేశారు. మంగళవారం రాత్రి ఎస్సీ కాలనీలో సుమారు గంటసేపు విద్యుత్‌కు అంతరాయం ఏర్పడినా సకాలంలో సిబ్బంది చేరుకోకపోవడంతో ఇబ్బందులు పడ్డారని తెలిపారు. విద్యుత్ సిబ్బంది స్థానికంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని, విద్యార్థులు, గ్రామ ప్రజలకు అసౌకర్యం కలగకుండా చూడాలని కోరారు.

పట్నాలకు హాజరుకావాలి

చొప్పదండి: పట్టణంలో గౌడ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించే ఎల్లమ్మ పట్నాలకు హాజరుకావాలని మాజీ ఎంపీ వినోద్ కుమార్‌కు బీఆర్ఎస్ నాయకులు బుధవారం ఆహ్వాన పత్రిక అందించారు. కార్యక్రమంలో స్థానిక గౌడ సంఘం అధ్యక్షుడు గంగయ్యగౌడ్, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ రవీందర్ రెడ్డి, చంద్రశేఖర్‌గౌడ్, వినయ్‌కుమార్, శ్రీనివాస్‌గౌడ్, సంపత్‌గౌడ్, నందయ్యగౌడ్, తదితరులు పాల్గొన్నారు.

పొదుపు సంఘ భవనంలో చోరీకి యత్నం

శంకరపట్నం: మండలంలోని తాడికల్‌కు చెందిన పురుషుల పొదుపు సంఘ భవనంలో చోరీకి యత్నించిన సంఘటన వెలుగులోకి వచ్చింది. బుధవారం సంఘం భవనం తాళాలు పగుల గొట్టి ఉండటంతో గ్రామస్తులు సభ్యులకు సమాచారం అందించారు. భవనంలోని బీరువాను పగలగొట్టి ఉండటంతో కమిటీ సభ్యులు పోలీసులకు సమాచారం అందించారు.

ముగిసిన ఇంటర్ ప్రథమ సంవత్సర పరీక్షలు

హుజూరాబాద్: ఇంటర్మీడియట్ మొదటి సంవత్సర పరీక్షలు బుధవారంతో ముగిశాయి. పట్టణంలో ప్రభుత్వ, కాకతీయ జూనియర్ కళాశాలలు, కేసీ క్యాంపులోని మైనార్టీ గురుకుల కళాశాలలో పరీక్షలు నిర్వహించారు. నిబంధనలకు అనుగుణంగా పరీక్షలు నిర్వహించామని పరీక్షా కేంద్రాల సీఎస్ లు నిర్మల, వేణుమాధవ్, కుమారస్వామి తెలిపారు.

పరీక్ష సామగ్రి పంపిణీ



పరీక్ష ప్యాడ్లు పంపిణీ చేస్తున్న గోవర్ధన్‌రెడ్డి

హుజూరాబాద్‌రూరల్: మండలంలోని జూపాక ప్రభుత్వ పాఠశాల పదో తరగతి విద్యార్థులకు రెడ్డి సంక్షేమ సంఘం గ్రామశాఖ అధ్యక్షుడు రూపిరెడ్డి గోవర్ధన్‌రెడ్డి బుధవారం పరీక్ష సామగ్రిని పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల టీచర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎస్సీ ఉపకులాలకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి



మాట్లాడుతున్న వేణు, సమ్మయ్య, తదితరులు

హుజూరాబాద్: ఎస్సీ ఉపకులాల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని ఎస్సీ 57 ఉపకులాల పోరాట సమితి రాష్ట్ర కార్యదర్శి సిరిపాటి వేణు అన్నారు. బుధవారం పట్టణంలోని సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. 22 లక్షల జనాభా ఉన్న ఎస్సీ 57 ఉపకులాలకు పోరాట సమితి జాతీయ అధ్యక్షుడు బైరి వెంకటేశంను ఉపకులాల కార్పొరేషన్ చైర్మన్‌గా నియమించాలని డిమాండ్ చేశారు. నియోజకవర్గంలో ఉపకులాల సంఖ్య దాదాపు ఆరువేలకు పైగా ఉందని, వారికి ఇండ్లు కేటాయించాలని కోరారు. ఈసమావేశంలో నాయకులు గడ్డం సమ్మయ్య, తూర్పాటి లింగయ్య, చింతల అంజి, వానరాశి జాన్ తదితరులు పాల్గొన్నారు.

భగీరథ ప్రయత్నం

- ఎండిపోతున్న వరదకాలువ
- రైతుల పరిస్థితి దయనీయం
- నీటిని విడుదల చేసి ఆదుకోవాలని అన్నదాతల ఆవేదన



కుర్మపల్లిలో వరదకాలువలో జేసీబీతో గుంతను తవ్విస్తున్న రైతు

రామడుగు: వరదకాలువలో నీరు ఎండిపోవడంతో రైతుల పరిస్థితి దయనీయంగా మారింది. దీంతో భగీరథ ప్రయత్నాలు చేస్తున్నారు. వారం రోజులుగా రైతులు నానా తంటాలు పడుతున్నారు. మండలంలోని తిర్మలాపూర్, శ్రీరాములపల్లి, రామడుగు, షానగర్, కుర్మపల్లి, పందికుంటపల్లి, కిష్టాపూర్ గ్రామాలకు చెందిన వందలాది మంది రైతులు వరదకాలువలో మోటార్లు బిగించుకొని వ్యవసాయం చేస్తున్నారు. ఈ ఏడాది ఆశించిన వర్షాలు కురవడంతో వరదకాలువ చుట్టు పక్కల రైతులు వరదకాలువలో విద్యుత్ మోటార్లు బిగించి వందలాది ఎకరాలలో వరి సాగు చేశారు. చేతికందే పంటను కాపాడుకోవడానికి రైతులు వరదకాలువలో జేసీబీలతో భారీ గుంతలను తవ్వి పంటలకు నీరు అందిస్తున్నారు. రైతులందరూ భగీరథ ప్రయత్నం చేస్తున్నా వరద కాలువలోకి నీరు రాని పరిస్థితి ఏర్పడిందని కుర్మపల్లి గ్రామానికి చెందిన రైతు శ్రీనివాస్ వాపోయాడు. ప్రభుత్వం అన్నదాతల పరిస్థితిని అర్థం చేసుకొని వరదకాలువలోకి నీటిని విడుదల చేసి ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

రసమయి నోరు అదుపులో పెట్టుకో..

- ఎంపీ సంజయ్‌పై మాట్లాడే అర్హత లేదు
- బీజేపీ దళిత మోర్చా జిల్లా అధ్యక్షుడు సోమిడివేణు ప్రసాద్



మాట్లాడుతున్న వేణుప్రసాద్, నాయకులు

కరీంనగర్‌టౌన్: బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్‌కుమార్‌పై మానకొండూరు మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ చేసిన వ్యాఖ్యలను బీజేపీ దళిత మోర్చా జిల్లా అధ్యక్షుడు సోమిడి వేణు ప్రసాద్ ఖండించారు. బుధవారం కరీంనగర్లో జరిగిన సమావేశంలో మాట్లాడారు. బండి సంజయ్ గురించి రసమయి తెలుసుకొని మాట్లాడాలని, గల్లీ నుంచి ఢిల్లీ స్థాయికి ఎదిగిన నాయకుడు సంజయ్ అని అన్నారు. తెలంగాణ కళాకారుడి ముసుగులో రాజకీయాల్లోకి వచ్చి రెండు పర్యాయాలు ఎమ్మెల్యేగా కొనసాగిన ప్రజలకు చేసింది ఏమీ లేదని, అందుకే మొన్నటి ఎన్నికల్లో ప్రజలు ఓడగొట్టినా బుద్ధి మారలేదని విమర్శించారు. సాంస్కృతికశాఖకు చైర్మన్‌గా ఉండి కళాకారులను మోసం చేసిన, ప్రజలను గోసపెట్టిన ఘనత నీకే దక్కుతుందన్నారు. బండి సంజయ్ చేసినా, చేస్తున్న ప్రజాసంగ్రామ, ప్రజాహిత యాత్రలు ప్రజల కోసమేనన్నారు. రసమయి అవగాహన లేకుండా నోటికివచ్చినట్టు మాట్లాడితే కుదరదని, జాగ్రత్తగా మాట్లాడాని హెచ్చరించారు. సమావేశంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి బత్తుల లక్ష్మీనారాయణ, జిల్లా నాయకుడు పరుశురాం, పర్వతం మల్లేశం, మహిళా మోర్చా ఉపాధ్యక్షురాలు మామిడి చైతన్య, ఎలుక రాజేశ్, తుర్పాటి రాజు, పుల్లమల్ల ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వరదకాలువకు నీటిని విడుదల చేయాలి



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్

గంగాధర: వరదకాలువకు నీటిని విడుదల చేసి ఎండిపోతున్న పంటలను కాపాడాలని మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ డిమాండ్ చేశారు. మండలంలోని మధురానగర్ చౌరస్తాలో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. చొప్పదండి నియోజకవర్గం గత ప్రభుత్వ పాలనలో కోనసీమను తలపించిందన్నారు. మండు వేసవిలో సైతం వరదకాలువలో నిండుగా నీరుండేదని, చెరువులు మత్తడి దూకాయన్నారు. పదేళ్ల కేసీఆర్ పాలనలో సాగు,తాగు నీటి సమస్యలేదని, ప్రస్తుతం కాంగ్రెస్ అధికారంలోకి రాగానే నీటి తంటాలు తప్పడం లేదన్నారు. రెండు రోజుల్లోనీటిని విడుదల చేయకుంటే ధర్నా, రాస్తారోకోలు చేస్తామన్నారు. సమావేశంలో నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

పోషకాహారంతోనే ఆరోగ్యం



మాట్లాడుతున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్‌రేణుక



మానకొండూర్: గంగిపల్లిలో సీడీపీవో సబితా

గంగాధర: పోషకాహారం తీసుకోవడం ద్వారానే గర్భిణులు, బాలింతలు, తల్లులు ఆరోగ్యంగా ఉంటారని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రేణుక సూచించారు. మండలంలోని గట్టుభూత్కూర్ గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం పోషకాహారంపై అవగాహక కార్యక్రమం నిర్వహించారు. ప్రతి ఒక్కరు ఆకుకూరలతో పాటు కూరగాయలు, గుడ్లు, చేపలు వంటి ఆహారంగా తీసుకోవాలన్నారు. వాటితో పాటు చిరుధాన్యాలైన రాగులు, పెసర్లు, బొబ్బర్లు, సజ్జలు, జొన్నలు, కందులు, శనగలు, పల్లీలు, నువ్వులు తీసుకోవాలని సూచించారు. బాలామృతంపై అవగాహన కల్పించారు. సమావేశంలో అంగన్‌వాడీ టీచర్లు విజయ, సరోజన, అనంతలక్ష్మి ఆయాలు, తల్లులు, పిల్లలు, కిశోర బాలికలు పాల్గొన్నారు.

మానకొండూర్: మండలంలోని గంగిపల్లి గ్రామంలో పోషణ్ పక్వాడ కార్యక్రమంలో భాగంగా పిల్లల తల్లులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పోషన్‌బీ, పడాయిబీ, ఐవైసీఎఫ్ చిరుధాన్యాలపై అవగాహన కల్పించారు. అనంతరం అన్నప్రాసన, అక్షరాభ్యాసం, పోషణ్ ప్రతిజ్ఞ చేయించారు. సీడీపీవో సబితా, సీహెచ్‌వో రా జునాయక్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అరుణ, ఏఎన్‌ఎం యాద, అంగన్‌వాడీ టీచర్లు, శారద, ఉమ, రాజకుమారి, ఆశా వర్కర్లు కవిత, స్వరూప, శైలజ, తిరుమల, మంజుల, పిల్లల తల్లులు పాల్గొన్నారు.

'పది'లో ఉత్తమ ఫలితాలు సాధించాలి



గన్నేరువరం: పాటలు పడుతున్న విద్యార్థులు



గంగాధర: డ్యాన్స్ చేస్తున్న విద్యార్థులు



చొప్పదండి: విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శలు

చొప్పదండి: మండలంలోని రుక్మాపూర్ శివారు మోడల్ స్కూల్‌లో పదో తరగతి విద్యార్థులకు బుధవారం వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఎంపీపీ చిలుక రవీందర్ ముఖ్య అతిథిగా హాజరై విజయం గమ్యం కాకూడదని, నిరంతరమనేది విద్యార్థులు గుర్తించాలని కోరారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కోల రమేశ్, పాఠశాల యాజమాన్య కమిటీ సభ్యులు, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

గన్నేరువరం: పదో విద్యార్థులు భయం వీడి శ్రద్ధతో పరీక్షలు రాసి ఉత్తమ ఫలితాలు సాధించాలని హెచ్ఎం శారధ, రామయ్య అన్నారు. మండలంలోని గన్నేరువరం, జంగపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బుధవారం పదో తరగతి విద్యార్థులకు వీడ్కోలు కార్యక్రమం, అలాగే జంగపల్లి పాఠశాల వార్షికోత్సవాలు నిర్వహించారు. విద్యార్థుల నృత్యాలు, పాటలు ఆకట్టుకున్నాయి.

గంగాధర: విద్యార్థులు పట్టుదలతో చదివి ఉత్తమ ఫలితాలు సాధించి ఉన్నత స్థాయిలో రాణించాలని మండల విద్యాధికారి వేణుకుమార్ సూచించారు. మండలంలోని ఉప్పరమల్యాల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బుధవారం పదో తరగతి విద్యార్థులకు వీడ్కోలు సమావేశం నిర్వహించారు. పది పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు రూ.ఆరువేలు అందజేస్తామని పంచాయతీ కార్యదర్శి లీలాదేవి ప్రకటించారు. 9 జీపీఏ సాధించిన ప్రతి విద్యార్థికి రూ.రెండు వేల చొప్పున అందజేస్తామని తాజామాజీ సర్పంచు బొల్లాడి మంజుల శ్రీనివాస్‌రెడ్డి ప్రకటించారు. ఈ సందర్భంగా నిర్వహించిన విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఇన్‌చార్జి హెచ్ఎం తిరుపతిరావు, రాజేందర్, ఉపాధ్యాయులు చంద్రశేఖర్‌రెడ్డి, హరిశంకర్, ఝాన్సీరాణి, వేణుగోపాలశర్మ, ఎం.బుచ్చయ్య, టి.శ్రీనివాస్, ప్రవీణ పాల్గొన్నారు.

వీణవంక: తల్లిదండ్రుల కలలు సాకారం చేయాల్సిన బాధ్యత విద్యార్థులపై ఉందని జిల్లా విద్యాధికారి జనార్దన్‌రావు అన్నారు. మండలంలోని ఎల్బాక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వేదపండితుల సమక్షంలో తల్లిదండ్రులకు పాదపూజ నిర్వహించారు. కార్యక్రమానికి డీఈవో హాజరై మాట్లాడారు. రాబోయే పది పరీక్షలలో మంచి మార్కులు సాధించాలని, చదువుతో పాటు అన్నిరంగాల్లో రాణించాలని ఆకాంక్షించారు. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో మామిడాలపల్లి హెచ్ఎం శోభారాణి, హెచ్ఎం అంజూరెడ్డి, పావని, జయేందర్‌రెడ్డి, సత్యనారాయణ, రామస్వామి, సాబీర్‌ఖాన్ ,రమేశ్ యాదవ్ ఉన్నారు.

కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ



శంకరపట్నం: మండలంలో పలువురి మంజూరైన కల్యాణలక్ష్మి చెక్కులను మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ క్యాంపు కార్యాలయంలో బుధవారం లబ్ధిదారులకు అందజేశారు. తహసీల్దార్ అనుపమ, ఆర్ఐ అరుణ పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

రికార్డు గదికి సీల్

శంకరపట్నం: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలోని రికార్డు గదికి బుధవారం సీల్ వేసి ఉండటంతో వివిధ గ్రామాలకు చెందిన రైతులు పహాణీల కోసం వేచి చూశారు. జమ్మికుంట అధికారి ఇంటిలో ఏసీబీ అధికారులు సోదాలు చేస్తున్నారన్న సమాచారం మేరకు సీల్ వేశారనే అనుమాన్ని రైతులు వ్యక్తం చేసారు. రికార్డు అసిస్టెంట్ అనిల్ మధ్యాహ్నం 12 గంటలు గడిచినా రాకపోవడంతో పలు అనుమానాలకు బలం చేకూరింది. సాయంత్రం నాలుగు గంటలకు అనిల్ కార్యాలయంలో కనిపించారు. ఈవిషయమై వివరణ కోరగా తాను విధులు ముగించుకుని వెళ్లినప్పుడు గదికి తాళం వేస్తానని, కలెక్టరేట్‌లో పని ఉన్నందున మ ధ్యాహ్నం వరకు కరీంనగర్‌లో ఉన్నానని చెప్పారు. రికార్డులు తారుమారు చేస్తారన్న అనుమానంతోనే సీల్ వేశారా అన్న విషయం తేలాల్సి ఉంది.

పనులు నిలిపివేయాలని వినతి

జమ్మికుంట: మున్సిపల్ పరిధిలోని 8వ వార్డు వరదకాలువ పక్క నుంచి 12 ఫీట్ల రహదారి కబ్జా చేసి ఓ ప్లాట్ యాజమాని అడ్డంగా నిర్మిస్తున్న గోడ పనులను నిలిపివేయాలని మున్సిపల్ కమిషనర్ అయాజ్‌కు వార్డు ప్రజలు, నాయకులు బుధవారం వినతిపత్రం అందజేశారు. గతంలో గోడ నిర్మాణం చేయగా అప్పటి మున్సిపల్ కమిషనర్‌కు ఫిర్యాదు చేస్తే గోడ కూల్చి వేయించారని మళ్లీ నిర్మిస్తున్నాడని విన్నవించాన్నారు. కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ నాయకులు కసుబోజుల వెంకన్న, సుంకరి రమేష్, ఎండీ సలీం, యగ్గని శ్రీనివాస్, చిన్నింటి నాగేంద్ర, వార్డు ప్రజలు యగ్గని శ్రావణ్‌కుమార్, అప్పాల సుహాసిని, మేదరి రాజమొగిలి, పానగంటి వేణుగోపాల్, రాజయ్యతదితరులు పాల్గొన్నారు.

బస్సు పునరుద్ధరణపై హర్షం

సైదాపూర్: హుస్నాబాద్ నుంచి దుద్దెనపల్లి, వయా ఎగ్లాస్‌పూర్, సోమారం, వెన్నంపల్లి, హుజూరాబాద్‌కు ఆర్టీసీ బస్సు పునరుద్ధరణ పట్ల ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. బుధవారం బస్సును రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రారంభించారు. ఎగ్లాస్‌పూర్‌కు వచ్చిన ఆర్టీసీ బస్సుకు గ్రామస్తులు స్వాగతం పలికారు. గతంలో నష్టాలస్తున్నాయని బస్సు సర్వీసును నిలిపివేశారు. పదేండ్లుగా బస్సును నడిపించాలని అప్పటి పాలకులను, డిపో మేనేజర్లను గ్రామస్తులు వేడుకున్నా, మండల పరిషత్ సమావేశాల్లో విన్నవించినా ఫలితం దక్కలేదు. ఇటీవల ఎన్నికల ప్రచారంలో పొన్నం ప్రభాకర్‌కు ఇచ్చిన హామీ మేరకు బస్సును పునరుద్ధరించడంతో ఆయన చిత్రపటానికి పాలాభిషేకం చేశారు.

విజయవంతం చేయాలి

జమ్మికుంట: కరీంనగర్ జిల్లా కేంద్రంలోని ముకుందలాల్ మిశ్రాభవన్‌లో ఈ నెల 29, 30, 31 తేదీల్లో నిర్వహించే సీపీఎం జిల్లా ప్లీనరీ సమావేశాలను జయప్రదం చేయాలని పార్టీ జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవరెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం జమ్మికంట పట్టణంలోని కార్యాలయంలో జోన్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దేశం, రాష్ట్రంలో ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాలు, ప్రజలపై ప్రభావం, ప్రజానీకం ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించి భవిష్యత్తు కార్యాచరణ రూపొందించడానికి సమావేశాలు ఉపయోగపడుతాయన్నారు. రాష్ట్ర నాయకులు హాజరవుతారని, కమ్యూనిస్టుల పోరాటాల ఫలితంగానే అనేక సంస్కరణలు, చట్టాలు వచ్చాన్నారు. నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరుకావాలని కోరారు. ఈ కార్యక్రమంలో జోన్ కార్యదర్శి శీలం అశోక్, కొప్పుల శంకర్, చెల్పూరిరాములు, జక్కుల రమేష్‌యాదవ్, దండిగారి సతీష్, తదితరులు పాల్గొన్నారు.

తపాలా సేవలు వినియోగించుకోవాలి

హుజూరాబాద్: తపాలా సేవలను ప్రజలు వినియోగించుకోవాలని పెద్దపల్లి తపాలాశాఖ సూపరింటెండెంట్ పసునూరి ప్రభాకర్ అన్నారు. బుధవారం పట్టణంలోని సిటీ సెంట్రల్ ఫంక్షన్ హాల్‌లో తపాలా శాఖ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శాఖ అందిస్తున్న రికరింగ్ డిపాజిట్, సేవింగ్ అకౌంట్, మహిళ సమ్మాన్ అకౌంట్, టైమ్ డిపాజిట్, ఇన్సూరెన్స్ లాభాలు వివరించారు. అనంతరం 2023–24 ఆర్థిక సంవత్సరంలో సేవింగ్ ఖాతా, ఇ న్సూరెన్స్, ఐపీపీబీ పథకాలలో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన వారికి మెమెంటోలు అందజేశారు. కార్యక్రమంలో జమ్మికుంట ఐపీపీ మోహన్, హెడ్ పోస్ట్‌మాస్టర్ మహేందర్, తపాలా ఉద్యోగులు ఉన్నారు.

ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలి

హుజూరాబాద్: విద్యార్థినులు పౌష్టికాహారం తీసుకుంటూ ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలని ప్రముఖ స్త్రీవైద్య నిపుణులు బోయినపల్లి మాధవి సూచించారు. బుధవారం పట్టణంలోని మాతృశ్రీ డిగ్రీ, పీజీ కళాశాలలోని విద్యార్థినులకు గర్భాశయవ్యవస్థ, నెలసరి సమస్యలపై జాగ్రత్తలు వివరించారు. అనంతరం ప్రతిమ ఫౌండేషన్ ప్రతినిధులు ఉచిత ఉపాధి నైపుణ్య అభివృద్ధి కేంద్రాల కోర్సుపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రతిమ వైద్య విజ్ఞాన సంస్థ నుంచి డాక్టర్లు రమ్య, శ్రీలేఖ, ప్రిన్సిపల్ శ్రీధర్, కరస్పాండెంట్లు ఇంద్ర సేనారెడ్డి, నర్సింహారెడ్డి, కౌశిక్, గీతారెడ్డి తదితరులు ఉన్నారు.

జాతర ఆదాయం లెక్కింపు

శంకరపట్నం: మండలంలోని కొత్తగట్టు మత్స్యగిరీంద్రస్వామి జాతర ఆదాయాన్ని బుధవారం లెక్కించారు. హుండీ, టికెట్లు, వేలం ద్వారా రూ.8,16,415 ఆదాయం వచ్చినట్లు ఈఓ సుధాకర్, ఆలయ చైర్మన్ మల్లారెడ్డి తెలిపారు. మిశ్రమ బంగారం 20 గ్రాములు, వెండి 266 గ్రాములు కానుకలుగా వేశారని అన్నారు. ఈకార్యక్రమంలో ఆలయ అర్చకులు శేషం మురళీధరాచార్యులు, మాధవాచార్యులు, ధర్మకర్తలు భ్రమరాంబిక సేవాసమితి బహిళా సభ్యులు పాల్గొన్నారు.

దేవాలయానికి గొడుగు బహూకరణ

రామడుగు: మండలంలోని శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయానికి కల్యాణోత్సవంలో ఉపయోగించే గొడుగు(ఛత్రం)ను గ్రామానికి చెందిన వంచ ఉపేందర్‌రెడ్డి(అవిష్కార్ విద్యా సంస్థల డైరెక్టర్ హైదరాబాద్) మిత్ర బృందం సభ్యులు బుధవారం దేవాలయం అభివృద్ధి కమిటీ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో దేవాలయాభివృద్ధి కమిటీ చైర్మన్ చెన్నమనేని రాజేందర్‌రావు, సభ్యులు దొడ్డ లచ్చిరెడ్డి, జితేందర్‌రెడ్డి, మురళీ, సుచరితరావు పలువురు పాల్గొన్నారు.

పనులు ప్రారంభం

రామడుగు: మండలంలోని దేశరాజ్‌పల్లి గ్రామంలో ఎన్ఆర్ఈజీఎస్ ద్వారా మంజూరైన నిధులతో చేపడుతున్న పనులకు బుధవారం చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ వంచ మహేందర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ కోల రమేశ్, మాజీ ఎంపీటీసీ మ్యాన మురళీధర్, నాయకులు అమిరిశెట్టి సుధాకర్, దామోదర్‌రెడ్డి, రత్నాకర్‌రెడ్డి, తడగొండ హన్మంతు, ఆనందరావు పలువురు పాల్గొన్నారు. మండల కేంద్రంలో సీసీరోడ్డు నిర్మాణానికి కరీంనగర్ ఎంపీ బండి సంజయ్‌కుమార్ నిధులు మంజూరు చేయగా బుధవారం బీజేపీ నాయకులు పనులను ప్రారంభించారు. నాయకులు శంకర్, తిరుపతి, ఎడవెల్లి రామ్, ఎడవెల్లి లక్ష్మన్, వేముల శ్రీనివాస్, జిట్టవేని అంజిబాబు పాల్గొన్నారు.

పరీక్ష ప్యాడ్లు పంపిణీ

గంగాధర: మండలంలోని బూర్గుపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాల పదోతరగతి విద్యార్థులకు హామ్ స్వచ్ఛంద సంస్థ నిర్వాహకులు బుధవారం పరీక్ష ప్యాడ్లు, పెన్నులు అందజేశారు. సంస్థ వ్యవస్థాపకుడు ధనపురి సాగర్ మాట్లాడుతూ.. విద్యార్థులు పట్టుదలతో చదివి ఉన్నత స్థాయిలో రాణించాలని, పరీక్షలు భయపడకుండా రాయాలని సూచించారు. ఫలితాల్లో 9.8 జీపీఏ సాధించిన విద్యార్థులకు సంస్థ తరుపున పారితోషికం అందజేస్తామన్నారు. హెచ్ఎం మల్లికార్జున్, దత్తాత్రేయ, సంస్థ నిర్వాహకులు గోగూరి శ్రీధర్‌రెడ్డి, రక్షన్, హిమసాయి, దేవి పాల్గొన్నారు.

కవయిత్రి మొల్ల జయంతి



పూలమాలలు వేస్తున్న రాధిక, నాయకులు

హుజూరాబాద్: పట్టణంలో కవయిత్రి మొల్ల జయంతిని ఘనంగా నిర్వహించారు. జమ్మికుంట రోడ్డులోని ఆమె విగ్రహానికి బుధవారం నాయకులు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం కుమ్మర ఫెడరేషన్ వెంటనే ఏర్పాటు చేయాలన్నారు. రామాయణం రచించిన మొదటి కవయిత్రి మొల్ల యువతకు ఆదర్శమన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ గందె రాధిక, వైస్ చైర్ పర్సన్ కొలిపాక నిర్మల, బండ శ్రీనివాస్, కౌన్సిలర్ కుమార్ యాదవ్, కుమ్మరి సంఘం నియోజకవర్గ ఇన్‌చార్జి ప్రభాకర్, కార్యదర్శి కుమార్, సంఘం పట్టణ అధ్యక్షుడు రవి, నాయకులు సదానందం, రాజు, శ్రీనివాస్, రాజు, తిరుపతి తదితరులు ఉన్నారు.

సీఆర్పీఎఫ్, పోలీసుల కవాతు



ఇల్లందకుంట: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో హుజూరాబాద్ ఏసీపీ శ్రీనివాస్‌జీ ఆధ్వర్యంలో బుధవారం సీఆర్పీఎఫ్, పోలీసులు ఇల్లందకుంటలో కవాతు నిర్వహించారు. ఏసీపీ మాట్లాడుతూ ప్రజలందరూ స్వేచ్ఛాయుత వాతావరణంలో ఓటు హక్కు వినియోగించుకోవాలని, యువత సామాజిక మాధ్యమాల్లో కుల,మత విద్వేషాలను రెచ్చగొట్టే విధంగా పోస్టులు చేయొద్దన్నారు. అనంతరం జమ్మికుంటరూరల్ సీఐ కిషోర్ మాట్లాడుతూ.. యువత రాజకీయ నాయకుల కోసం జీవితాలను నాశనం చేసుకోవద్దని, ఎలక్షన్లు ఐదేళ్లకోసారి వస్తాయని, ఒక్కసారికేసు అయితే జీవితం చాలా నష్టపోవాల్సి వస్తుందని సూచించారు. కార్యక్రమంలో వీణవంక ఎస్ఐ తిరుపతి, సురేందర్‌రెడ్డి, తిరుపతి, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు



పశువైద్య శిబిరంలో జిల్లా పశువైద్యాధికారి నరేందర్

రామడుగు: జిల్లా వ్యాప్తంగా నిర్వహిస్తున్న శిబిరాల్లో రైతులు పశువులకు తప్పకుండా గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయించాలని జిల్లా పశువైద్యాధికారి బి.నరేందర్ సూచించారు. మండలంలోని చిప్పకుర్తి గ్రామంలో నిర్వహించిన పశు వైద్య శిబిరాన్ని బుధవారం తనిఖీ చేశారు. అనంతరం రైతులతో మాట్లాడారు. ప్రాణాంతకమైన గాలికుంటు వ్యాధి నివారణకు టీకాలు వేయించాలని, వేసవిలో పశువులకు బెల్లం, ఉప్పు కలిపిన చల్లని నీటిని అందించాలని లేదంటే వడదెబ్బకు గురయ్యే ప్రమాదం ఉంటుందన్నారు. కార్యక్రమంలో మండల పశువైద్యాధికారి అనిల్‌కుమార్ రెడ్డి, వైద్య సిబ్బంది గిరిధర్, శంకర్‌గౌడ్ పాల్గొన్నారు.

శంకరపట్నం: మండలంలోని కన్నాపూర్‌లో బుధవారం వైద్యాధికారి మాధవరావు ఆధ్వర్యంలో పశువైద్యశిబిరం నిర్వహించారు. పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేశారు. ఈకార్యక్రమంలో ఎంపీటీసీ భాగ్యలక్ష్మి, మాజీ వైస్ఎంపీపీ ఎల్లారెడ్డి, ఆరిఫ్, అహ్మద్, మొండయ్య పాల్గొన్నారు.

ఎన్ఎస్ఎస్ విద్యార్థుల ర్యాలీ



సైదాపూర్: మండలంలోని లస్మన్నపల్లిలో ప్లాస్టిక్ వాడకం తగ్గించాలని ఎన్ఎస్ఎస్ విద్యార్థులు బుధవారం గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఎన్ఎస్ఎస్ శిబిరంలో భాగంగా మూడో రోజు గ్రామంలో ప్లాస్టిక్ వాడకం, అనర్థాలపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.